క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



నెల్లికుదురు: జాతీయస్థాయి సెపక్ తాక్రా పోటీలకు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని అక్కెర సుచిత్ర ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు చెడుపల్లి ఐలయ్య బుధవారం తెలిపాడు. ఈనెల 23 నుంచి 25వరకు నాగాలాండ్ రాష్ట్రంలోని కోహిమాలో జరిగే పోటీలో పాల్గొంటుందన్నారు. విద్యార్థిని హెచ్ఎం రవి, చైర్మన్ పొన్నం మమత, సెక్రటరీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

రూ.15వేల ఆర్థికసాయం

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన ఓరుగంటి సూరయ్య అనే వ్యక్తి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఈ మేరకు శ్రీలక్ష్మీనరసింహస్వామి కార్ యూనియన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.15వేల ఆర్థికసాయాన్ని బుధవారం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు శోభన్, కోశాధికారి మహమ్మద్ రహీం, బండి సంతు, శ్రీను, రమేశ్‌రెడ్డి, హరిచంద్, నాగరాజు పాల్గొన్నారు.

దుర్గా భవానికి ఎక్సలెన్స్ అవార్డు



తొర్రూరు రూరల్: మండలంలోని సోమారం గ్రామానికి చెందిన తొర్రూరు పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ రావు కుమార్తె కాకిరాల దుర్గాభవానికి ఎంతో ప్రతిష్టాత్మకమైన ఇండియా ఎక్సలెన్స్ పురస్కారాన్ని బుధవారం బెంగుళూరులో అందుకున్నారు. కృత్రిమ మేధపై విస్తృత పరిశోధనలు నిర్వహించిన దుర్గాభవానికి పురస్కారం అందజేశారు.

క్రీడల్లో విద్యార్థినుల ప్రతిభ

మరిపెడ/మరిపెడ రూరల్: వరంగల్ జిల్లా రాయపర్తి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 10వ జోనల్ స్థాయి క్రీడలు నిర్వహించారు. క్రీడల్లో పాల్గొన్న మండల కేంద్రంలోని నర్సింహులపేట టీజీ డబ్ల్యూఆర్ఎస్ గురుకుల బాలికలు ఓవరాల్ చాంపియన్ షిప్ కై వసం చేసుకున్నారు. గుగులోతు అంజలి గోల్డ్ మెడల్ సాధించింది. అదేవిధంగా అండర్–17 ఖోఖో మొదటి బహుమతి ఆర్.చందన టీమ్, చెస్‌లో బి.దివ్య ద్వితీయ బహుమతులు సాధించారు. పాఠశాల ప్రిన్సిపాల్ అరుణశ్రీ, పీఈటీలు భవాని, సంతు, ఉపాధ్యాయులు అభినందించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

డోర్నకల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలవుతున్నాయని డోర్నకల్ మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపాడు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు కృష్ణవేణి, డీటీ వీరన్న, సుమేర్‌చంద్‌జైన్, మాదా శ్రీనివాస్, హరికృష్ణ పాల్గొన్నారు.

సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

నెహ్రూసెంటర్: రవాణారంగ కార్మికుల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశాడు. ప్రైవేట్ అండ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, హమాలీ కార్మికులు 30మంది సీఐటీయూలో బుధవారం చేరారు. కార్యక్రమంలో నాయకులు సోమయ్య, సీతారాంనాయక్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

తొర్రూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈఓ మహంకాళి బుచ్చయ్య సూచించారు. బుధవారం మండలంలోని వెలికట్ట, హరిజన కాలనీ, పెద్దమంగ్యా తండాల్లోని ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

తహసీల్దార్‌కు వినతి

మరిపెడ/మరిపెడ రూరల్: భవన నిర్మాణ కార్మికుల నిధుల కాజేయడానికి క్యాంపుల పేరుతో గ్రామాలకు వస్తున్న బోగస్ హెల్త్ క్యాంపులను ప్రభుత్వం తక్షణమే అరికట్టాలని సీఐటీయూ జిల్లా నాయకుడు దుండి వీరన్న అన్నారు. ఈమేరకు బుధవారం తహసీల్దార్ సైదులుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ ఉప్పలయ్య, నందిపాటి వెంకన్న, నాయకులు సైదులు, వెంకన్న, బల్లెం పాపయ్య పాల్గొన్నారు.

బియ్యం అందజేత

మహబూబాబాద్ రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో జక్క ఎల్లయ్య మృతిచెందగా స్థానిక మున్సిపల్ వార్డు కౌన్సిలర్ దండెబోయిన బుజ్జివెంకన్న బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి క్వింటా బియ్యం అందజేశారు.

పునర్నిర్మాణానికి మోక్షమెప్పుడో?

- వరదలకు రాళ్లు తేలి ధ్వంసమైన ఆలయాలు
- నిలిచిన పూజలు..
- మరమ్మతు చేయాలని కోరుతున్న ప్రజలు

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని ఆకేరువాగు ఒడ్డున వెలిసిన గంగమ్మ తల్లి కోరుకున్న వారి కోరికలు తీరుస్తుందని ఈ ప్రాంత ప్రజల ప్రగాఢ విశ్వాసం. ప్రతి ఆదివారం జాతరను తలపించే విధంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకునే వారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గంగమ్మ, పెద్దమ్మ తల్లుల ఆలయాలు పూర్తిగా నీటమునిగి ధ్వంసమయ్యాయి. దీంతో వారాంతపు పూజలు నిలిచిపోయి భక్తుల రద్దీ తగ్గిపోయి ఆలయాలు వెలవెలబోతున్నాయి. చిన్నగూడూరు, మరిపెడ, నర్సింహులపేట, మహబూబాబాద్ మండలాలకు చెందిన ఆయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ప్రతి ఆదివారం పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకునేవారు. స్థానిక ప్రజలు శుభకార్యం చేయాలన్నా, సాగు పంటలు మొదలు పెట్టాలన్నా.. ముందు గంగమ్మ తల్లిని దర్శించుకుని పూజలు మొదలు పెడతారు. ఇలాంటి పురాతన చరిత్ర కలిగిన ఆలయాలకు గత రెండేళ్లుగా వచ్చిన ఆకేరు వరద ఉధృతికి ధ్వంసమయ్యాయి. గంగమ్మ ఆలయం వెనుక భాగం కూలిపోయి అమ్మవారి విగ్రహం రెండు భాగాలుగా విడిపోయింది. ఆలయం వద్దకు వెళ్లాలన్నా గుడిలో అమ్మవారు లేరు. గుడి పరిసరాలు కోతకు గురై రాళ్లు తేలి భక్తులకు ఇబ్బందిగా మారింది. స్థానిక ప్రజాప్రతినిధులు కూడా పట్టించుకోవడం లేదంటూ ఆ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆలయ పునర్నిర్మాణానికి ప్రజాప్రతినిధులు చొరవ చూపి పూజలు కొనసాగేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ప్రస్తుతం ఆలయాల వద్ద దర్శనమిస్తున్న రాళ్లు



కూలిన ఆలయంలోని ఓ భాగం

ఆలయాలకు పూర్వ వైభవం తేవాలి



ప్రతి ఆదివారం జాతరగా ఉండే గంగమ్మ, పెద్దమ్మ తల్లుల ఆలయాలు ఆకేరు ఉధృతికి ధ్వంసమవడంతో భక్తుల రద్దీ తగ్గిపోయింది. ప్రజాప్రతినిధులు చొరవ చూపి ఆలయాలకు పూర్వ వైభవం తేవాలి.

– జంపాల సోమన్న, చిన్నగూడూరు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

నర్సింహులపేట: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. బుధవారం మండలంలోని వంతడపల స్టేజీ, ముంగిమడుగు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా, కొనుగోలు కేంద్రంలో క్వింటాకు రూ.500 బోనస్ చొప్పున అమ్మాలని కోరారు. ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో త్వరగా పడేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చప్పిడి నాగరాజు, ఏపీఎం వీరయ్య, ఏఓ వినయ్‌కుమార్, ఏఈఓ పాండు, సీసీలు, నాయకులు సత్యనారాయణ, రమేష్, రాజశేఖర్, సతీష్, భద్రయ్య పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మద్దతు ధరతోపాటు బోనస్ చెల్లించాలి



మాట్లాడుతున్న సురేందర్

గూడూరు: ధాన్యానికి మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ వెంటనే చెల్లించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేరెడ్డి సురేందర్ డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సందర్శించారు. కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా రైతు పండించిన పంటలకు మద్దతు ధర ప్రకటించిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ధాన్యానికి రూ. 500 బోనస్ ఇస్తానని చెప్పి, ఇప్పుడు సన్నరకానికి మాత్రమే అంటూ మోసం చేస్తున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు వడ్లకొండ యాకయ్యగౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేష్‌యాదవ్, చెల్పూరు శ్రీశైలం, రాసమల్ల వెంకన్న, పదాల నాగరాజు, బత్తుల లక్ష్మణ్‌యాదవ్, అరవింద్, శ్రీధర్ పాల్గొన్నారు.

ధాన్యం బోనస్‌పై అపోహలు వీడాలి

నెల్లికుదురు: సన్నరకం వరి ధాన్యానికి ప్రభుత్వం అందించే బోనస్ డబ్బులు ఖాతాల్లో పడుతాయో లేదో అన్న రైతులు అపోహలు వీడాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ రైతులకు సూచించారు. మండలంలోని శ్రీరామగిరి సొసైటీ ఆధ్వర్యంలో ఆలేరు, శ్రీరామగిరి, మధనతుర్తి, రావిరాల ఎర్రబెల్లిగూడెం సొసైటీ ఆధ్వర్యంలో ఎర్రబెల్లిగూడెం, మేచరాజుపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు స్థానిక రైతులతో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలల్లో విక్రయించే సన్నరకం వరిధాన్యానికి రూ.2,320తోపాటు ప్రభుత్వం అందించే బోనస్ రూ.500లతో కలిపి రైతుల ఖాతాల్లో వేస్తుందన్నారు. కార్యక్రమంలో చైర్మన్లు గుండ వెంకన్న, పానుగోటి దేవేందర్‌రావు, ఏఓ యాస్మిన్, ఏఈఓలు, సీఈఓలు, సొసైటీ, ఏఎంసీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

‘ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ’

నెహ్రూసెంటర్: మూసీనదిని పునరుజ్జీవనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుంటే, బీజేపీ మాత్రం రాజకీయం చేస్తోందని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కోండ్ర ఎల్లయ్య విమర్శించాడు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాకుండా బీజేపీ మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటనలు చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో శ్రీను, దేవి, ఉపేందర్, ఎలేందర్ పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రగతి సేవా సమితి

మరిపెడ రూరల్: నిరుపేదలకు ప్రగతి సేవా స్వచ్ఛంద సంస్థ అండగా ఉంటుందని, గతంలో మహిళ గ్రూప్‌లకు కోట్ల రూపాయల రుణాలు మంజూరు చేసి వారు ఆర్థిక పరపతి సాధించారని ప్రగతి సేవా సమితి వ్యవస్థాపకుడు గద్దల జాన్ అన్నారు. బుధవారం మండలంలోని అబ్బాయిపాలెం గ్రామంలో సేవా సమతి కార్యాలయంలో రైతులు, మహిళలకు పొదుపు సంఘాల ఏర్పాటుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జాన్ మాట్లాడారు. కార్యక్రమంలో ఐనాల పరశురాములు, చేడుపాక వెంకన్న, ఆలేటి వంశీ, జినక సువార్త, జిన్న లచ్చయ్య, సీత వీరభద్రం పాల్గొన్నారు.

‘గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు’

మహబూబాబాద్ అర్బన్: గ్రంథాలయాలు ఎందరినో ఉన్నతులుగా తీర్చిదిద్దే విజ్ఞాన నిలయాలు అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి. లక్ష్మణ్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల గ్రంథపాలకుడు రాజశేఖర్, వైస్. ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, కోఆర్డినేటర్ అనిల్ కుమార్, అధ్యాపకులు శ్రీనివాస్, సాంబశివరావు, మసూద్ అహ్మద్, అన్నపూర్ణ, వినోద్ కుమార్, హాతీరామ్, ఖాసీంషా, తదితరులు పాల్గొన్నారు.



రంగనాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

ప్రజాసమస్యలపై సీపీఐ పోరాటం



మాట్లాడుతున్న విజయసారథి

నెహ్రూసెంటర్: ప్రజలు, కార్మికులు, సమస్యలపై నిత్యం సీపీఐ చేస్తున్న పోరాటాలకు వందేళ్లు అని, సీపీఐ శతజయంతి ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పిలుపునిచ్చారు. మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని 25వ వార్డు ఎన్నికల సన్నాహక సమావేశాన్ని తోట రాజకుమారి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా విజయసారథి మాట్లాడుతూ.. వందేళ్ల సీపీఐ చరిత్రలో ఎన్నో పోరాటాలు, విజయాలు సాధించి ప్రజల పక్షాన నిలబడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై అలుపెరుగని పోరాటాలకు దిక్సూచిగా సీపీఐ నిలబడిందని కొనియాడారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో సీపీఐని ఆదరించి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథి రెడ్డి, కుమార్, వెంకన్న, శంకర్, తండ శ్రీనాథ్, మాలోత్ రవీందర్ పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా?

డోర్నకల్: సీరోలు మండలం మోదుగ్గడ్డతండా నుంచి ఆకేరువాగుకు వెళ్లే రోడ్డు ధ్వంసమవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో ఆకేరువాగు పొంగి మోదుగ్గడ్డతండా, దుబ్బగడ్డతండాలను ముంచెత్తడంతో రోడ్లు ధ్వంసమయ్యాయి. ప్రస్తుతం వరికోతలు ప్రారంభం కావడంతో దారి సక్రమంగా లేక రైతులు నరకయాతన పడుతున్నారు. అధికారులు స్పందించి దారికి మరమ్మతులు చేయించి వాహన రాకపోకలను పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.



గుంతలుగా మారిన రోడ్డు..

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

గార్ల: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన లబ్ధిదారులందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 10ఏళ్లగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వక పోవడంతో అనేక మంది ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరం అయ్యారని ఆవేదన వ్యక్తం చేశాడు. నిస్పక్షపాతంగా అర్హులైన లబ్ధిదారులను ఇందిరమ్మ ఇళ్లకు ఎంపిక చేయాలన్నాడు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, రాగం రమేష్, జనార్దన్, భిక్షమయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

క్రైం కార్నర్..

చికిత్స పొందుతున్న మహిళ మృతి

డోర్నకల్: ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. డోర్నకల్ హెడ్‌కానిస్టేబుల్ ఎస్‌కె సైదులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. వెన్నారం గ్రామానికి చెందిన తోట అనూష(23)కు సూర్యాపేట జిల్లా నడిగూడెంకు చెందిన పసుపులేటి వీరబాబుతో 8ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొద్ది రోజుల క్రితం భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండగా అనూష వెన్నారంలోని తల్లిగారి ఇంటి వద్ద ఉంటోంది. పెద్ద మనుషులు ఇటీవల ఇద్దరి మధ్య సయోధ్య కుదుర్చగా పరిస్థితి సద్దుమణుగుతుందని భావించిన నేపథ్యంలో అనూష ఈనెల 14న ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందింది. మృతురాలి సోదరుడు వాసంశెట్టి సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సైదులు తెలిపారు.

గోల్‌తండాలో..

నర్సింహులపేట: మండలంలోని గోల్‌తండాకు చెందిన లూనావత్ సురేష్(24) అనే వ్యక్తి పురుగుల మందుతాగి వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్సై మాలోతు సురేష్ కథనం ప్రకారం.. గోల్‌తండాకు చెందిన సురేష్‌తో అదేతండాకు చెందిన ప్రవళికతో గత సంవత్సరం వివాహం అయింది. భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో మనస్తాపానికి గురైన సురేష్ ఈనెల 14న పురుగుల మందు తాగాడు. వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హత్యాయత్నం కేసులో అరెస్టు

కురవి: సీరోలు మండల కేంద్రానికి చెందిన గంగారపు సుధాకర్ అనే వ్యక్తిని ట్రాక్టర్‌తో ఢీకొట్టి చంపేందుకు ప్రయత్నించిన సీరోలు గ్రామానికి చెందిన పత్తి అంతయ్య అనే వ్యక్తిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీరోలు ఎస్సై నగేష్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం.. కాపాడిన పోలీసులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఆమెకు సీపీఆర్ చేసి ఆస్పత్రిలో చేర్పించిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. బ్లూ కోల్ట్స్ పీసీలు రాంబాబు, రవి తెలిపిన వివరాల ప్రకారం..జిల్లాలోని సీరోలు మండలం ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన తల్లాడ స్పందన భర్త లక్ష్మీనారాయణ పదేళ్ల క్రితం మృతిచెందగా జిల్లా కేంద్రంలోని నెహ్రూ సెంటర్ ప్రాంతంలో స్పందన నివాసం ఉంటుంది. వారి బంధువులతో భూ తగాదాలు ఉండగా ఆమె కొందరికి డబ్బులు అప్పుగా ఇచ్చింది. అప్పులు తీసుకున్న వారి వద్ద నుంచి రావలసిన డబ్బులు రాకపోవటంతో మనోవేదనకు గురైంది. ఈ క్రమంలో ఆమె మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవాలని ప్రయత్నించి వీడియో కాల్ ద్వారా హైదరాబాదులో ఉన్న తన మిత్రురాలు నవ్యకు ఫోన్ చేసి చెప్పింది. నవ్య వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వగా మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు రాంబాబు, రవి సంఘటన స్థలానికి చేరుకుని ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించిన స్పందనను వెంటనే ఉరి తొలగించి కిందకు దింపారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెకు హుటాహుటిన సీపీఆర్ చేసి చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఐసీయూలో చికిత్స అందించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో బుధవారం అర్ధరాత్రి మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

సంక్షిప్త సమాచారం

నూతన కమిటీ ఎన్నిక

బయ్యారం: టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా గుగులోత్ బాలునాయక్, ప్రధాన కార్యదర్శిగా గంగావత్ వెంకన్నను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా తురసం శ్రీను, అరుణాదేవి, కార్యదర్శులు సురేష్, శ్రీనివాస్, రామకృష్ణ, తులసీదాస్, కోశాధికారిగా రమేశ్, ఆడిటర్‌గా కాంతారావు, జిల్లా కౌన్సిలర్‌గా రమణమ్మలను ఎన్నుకున్నారు.

పాఠశాలల సందర్శన

కేసముద్రం: మండలంలోని కల్వల మోడల్ స్కూల్, కేసముద్రంవిలేజ్‌లో శ్రీవివేకవర్ధిని హైస్కూల్, సబ్‌స్టేషన్ తండాజీపీలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లను, జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ ఆజాద్ చంద్రశేఖర్, ఎంఈఓ కాలేరు యాదగిరి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈమేరకు విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు.

భవిష్యత్‌కు మూలస్తంభాలు బాలలు

మహబూబాబాద్: బాలలు స్థిరమైన భవిష్యత్‌కు మూలస్తంభాలు అని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ అశోక్ అన్నారు. అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్‌లో గల ప్రభుత్వ బాలుర సదనంలో పలు కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో డేవిడ్, కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కురవి: వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సీరోలు మండల వ్యవసాయ శాఖ అధికారి చాయారాజ్, కాంపల్లి పీఏసీఎస్ చైర్మన్ కొండపల్లి శ్రీదేవి అన్నారు. బుధవారం సీరోలు మండలం తాళ్లసంకీస గ్రామంలో ఏర్పాటు చేయనున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులకు సూచనలు ఇచ్చారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

మరిపెడ రూరల్: ఐకేపీ, సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని గుండెపూడి మాజీ సర్పంచ్ నూకల కిషన్‌రెడ్డి అన్నారు. బుధవారం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో స్వయం కృషి మహిళ సంఘం ఏర్పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బోడ వీరసింగ్, ఏపీఎం బానోతు రాములు, బారి మంజు పాల్గొన్నారు.

భూమిలోనే కలియ దున్నాలి

దంతాలపల్లి: రైతులు వరికొయ్యలను కాల్చకుండా భూమిలోనే కలియదున్నాలని మండల వ్యవసాయ అధికారి వాహిని అన్నారు. బుధవారం మండలంలోని కుమ్మరికుంట్ల, రేపోణి గ్రామాలలో రైతుల పొలాలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశాడు.

కంటి వైద్యశిబిరం

కురవి: మండలంలోని నేరడ గ్రామంలోని డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం గ్రంథాలయ చైర్మన్ ఎస్‌కె జానీ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత కంటి శుక్ల వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. రూ.5వేల విలువైన కంటి చుక్కల మందులు, టాబ్లెట్స్‌ను డాక్టర్ మధుసూదన్ ఉచితంగా అందజేశారు.

దాతల సాయం అభినందనీయం

పెద్దవంగర: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ వరంగల్ సేవలు అభినందనీయమని హెచ్ఎం లీలా శోభరాణి అన్నారు. బుధవారం మండలంలోని బొమ్మకల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ ప్రతినిధులు టై, బెల్ట్‌లు అందజేశారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులు రాజగోపాల్, గంట వేణుగోపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దంతాలపల్లి: నేడు దంతాలపల్లి, పెద్దముప్పారంతోపాటు మండల పరిధిలో గల వివిధ విద్యుత్ ఉపకేంద్రాల్లో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ అధికారి ప్రవీణ్ బుధవారం తెలిపాడు.

విజయవంతం చేయాలి

తొర్రూరు: డివిజన్ కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక మండలశాఖ వారి ఆధ్వర్యంలో నేడు గురువారం హైస్కూల్‌లో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు తాళ్లపెల్లి రమేశ్‌గౌడ్ బుధవారం పిలుపునిచ్చాడు.

సెల్‌ఫోన్ అప్పగింత

బయ్యారం: మండలంలోని గంధంపల్లిలో పోలోజు సృజన ఈనెల 13న సెల్‌ఫోన్ పోగొట్టుకుంది. ఈమేరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ నిర్వహించిన పోలీసులు సెల్‌ఫోన్‌ను గుర్తించి, సృజన కుటుంబ సభ్యులకు బుధవారం ఎస్సై తిరుపతి అందజేశాడు.

ధర్నాను జయప్రదం చేయాలి

గార్ల: మహబూబాబాద్‌లో నేడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో రాధాకృష్ణ, రమేశ్, గణేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

కేసముద్రం: మండలంలోని అర్పనపల్లి గ్రామంలో పాడి పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు విజయ్‌కుమార్, రవీందర్, గోపాలమిత్ర ఏరియా సూపర్‌వైజర్ రఘువీర్, సుధాకర్, సుభాని పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటాం..

నెహ్రూసెంటర్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం దళితుల భూములను దౌర్జన్యంగా లాక్కొని మున్సిపాలిటీ, పల్లెప్రకృతి వనాలు, శ్మశానవాటికలు, దళితుల ఇనాం భూముల్లో భవనాలు నిర్మించారని దళిత నాయకుడు పుచ్చకాయల మధు అన్నారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో కేటీఆర్ గోబ్యాక్ అంటూ బుధవారం నిరసన తెలిపాడు. కేటీఆర్ పర్యటనను అడ్డుకుంటామని తెలిపాడు.

సంక్షేమ పథకాలపై కళా ప్రదర్శన



మహబూబాబాద్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రజాపాలన కళాయాత్ర బుధవారం చేపట్టారు. జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గిద్దె రాంనర్సయ్య, బండ వెంకన్న, రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక కళాకారులు మండలంలోని అమ్మాపురం, చింతలపెల్లి, తొర్రూరులోని విశ్రాంతిభవనం సెంటర్లలో కళా ప్రదర్శనాలు చేసి అవగాహన కల్పించారు.